క్లుప్తంగా

కంచర్ల రామయ్యకు సంతాపం

కందుకూరు రూరల్: ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మరణానికి టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. టీఆర్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్‌గా కంచర్ల రామయ్య ఉన్నారు. ఆయన అకాల మరణానికి చింతిస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. రామయ్య కళాశాలకు అందించిన సేవలు, ఆర్థిక తోడ్పాటును గుర్తు చేసుకున్నారు.

కేవీకేలో యోగా దినోత్సవం నేడు

కందుకూరు రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కందుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శనివారం ఉదయం 6.30 నుంచి 7.45 గంటల వరకు యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కేవీకే హెడ్ జి.ప్రసాద్‌బాబు తెలిపారు. కార్యక్రమానికి రైతులు, రైతు మహిళలు, గ్రామీణ యువతీ యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎంవీఐగా అనిల్‌కుమార్



ఎంవీఐగా బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్

కందుకూరు: కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖ మోటార్ వాహనాల తనిఖీ అధికారిగా జంగాల అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ మోటార్ వాహనాల తనిఖీ అధికారిగా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌ను కందుకూరు ఎంవీఐగా బదిలీ చేశారు. అదే విధంగా ఇక్కడ ఎంవీఐగా పనిచేస్తున్న చెన్నూరు రాంబాబును నెల్లూరు జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా బదిలీ చేశారు.

ఘనంగా రెవెన్యూ డే



లింగసముద్రంలో తహసీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

లింగసముద్రం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే దినోత్సవాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థ పుట్టి 239 సంవత్సరాలు అయిందని అన్నారు. తహసీల్దార్‌ను రెవెన్యూ అధికారులు పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య, సర్వేయర్లు, వీఆర్వోలు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పొందాలంటే రైతులు ముందుగా వారి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పుల్లారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల భూములు జాయింట్ ల్యాండ్‌గా నమోదైనందున తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు పొందడానికి అనర్హులుగా మిగిలిపోయారన్నారు. ఎల్పీఎం కలిగిన లబ్ధిదారుల భూములకు సంబంధించిన విస్తీర్ణం అధికంగా నమోదు కావడం వలన పథకాలకు అనర్హులుగా చూపిస్తోందన్నారు. జాయింట్ ఎల్పీఎం కలిగిన రైతులు వెంటనే సింగిల్ ఎల్పీఎంగా మార్చుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోపు చేయించుకోవాలన్నారు. లేకపోతే ప్రభుత్వ పథకాలు కోల్పోతారని తెలిపారు.

ఉన్నా..ఉపయోగం సున్నా

- రూ.70 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన గత ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలో లబ్ధిదారులకు గదులు అప్పగించక పోవడంతో నిరుపయోగం
- మున్సిపల్ ఆదాయానికి గండి



పాత లారీ స్టాండ్ స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

కందుకూరు:

రూ.లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేసి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ కూటమి ప్రభుత్వ నిర్వాకంతో నిరుపయోగంగా మారింది. గతంలోనే ప్రారంభోత్సవం చేసినా ఏడాదిన్నర కాలంగా లబ్ధిదారులకు మాత్రం గదులు అప్పగించలేదు. దీంతో అడ్వాన్స్‌లు చెల్లించి షాపింగ్ కాంప్లెక్స్‌లో రూమ్‌లు దక్కించుకున్న వారు ఆవేదన వ్యక్తం చేస్తుండగా, మరోపక్క మున్సిపల్ ఆదాయానికి గండిపడుతోంది.

మున్సిపాలిటీ మూలధన ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా గత ప్రభుత్వం పట్టణంలో పలుచోట్ల షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టింది. దీని వల్ల పట్టణంలో ఖరీదైన మున్సిపల్ స్థలాలు పరిరక్షించడమే కాకుండా మున్సిపాలిటీకి అద్దెల రూపంలో శాశ్వత ఆదాయం సమకూరేలా పలు షాపింగ్ కాంప్లెక్స్‌లకు రూపకల్పన చేశారు. దీనిలో భాగంగా ఏరియా హాస్పిటల్ ఎదురుగా ఉన్న స్థలంతో పాటు పాత కూరగాయల మార్కెట్, పాత లారీ స్టాండ్ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. ఏరియా హాస్పిటల్ ఎదురుగా నిర్మించిన వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్, కూరగాయల మార్కెట్ వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లను పూర్తి చేసి వేలం పాటలో రూములు దక్కించుకున్న వారికి అప్పగించారు. ప్రస్తుతం ఆయా షాపింగ్ కాంప్లెక్స్‌లో లబ్ధిదారులు చక్కగా వ్యాపారులు కూడా చేసుకుంటున్నారు. వీటితో పాటు పాత లారీ స్టాండ్ స్థలంలో రూ.70 లక్షలు ఖర్చు చేసి 18 గదులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఈ కాంప్లెక్స్‌ను గత ఏడాది మార్చి నెలలో అప్పటి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. వేలంపాట ద్వారా లబ్ధిదారులకు గదులు కూడా కేటాయించారు. అయితే విద్యుత్ మీటర్లు బిగించే పనులతో పాటు, చిన్న చిన్న సివిల్ పనులు ఉండడంతో లబ్ధిదారులకు గదులు అప్పగించలేదు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో వీటి గురించి పట్టించుకునే అధికారులు లేకుండా పోయారు. కానీ ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు వీటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. గత ఏడాదిన్నర కాలంగా గదులను లబ్ధిదారులకు అప్పగించకుండా కాలయాపన చేస్తుంది. దీంతో దాదాపు రూ.50 వేలు అడ్వాన్స్‌గా చెల్లించి వేలంపాటలో పాల్గొని గదులు దక్కించుకున్న వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కేటాయించిన విధంగా గదులు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, లేదంటే తాము కట్టిన రూ.50 వేలు తిరిగి ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. అయితే ఆ షాపింగ్ కాంప్లెక్స్‌కు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అప్పగించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రతినెలా అద్దెల రూపంలో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్‌లో మిగిలిన పనులు పూర్తి చేసి వీలైనంత త్వరగా తమ కేటాయించిన గదులను అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



అప్పట్లో ప్రారంభోత్సవం చేసిన శిలాఫలకం

మార్కెట్‌కు అనుగుణంగా బేళ్లు తీసుకురావాలి



కొండపిలో వేలాన్ని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి: మార్కెట్‌కి అనుగుణంగా పొగాకు బేళ్లను తీసుకురావాలని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ రైతులందరూ మండెల్లో మగ్గిన పొగాకును బేళ్లుగా కట్టుకుని అమ్మకానికి తీసుకురావాలన్నారు. బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చేటప్పుడు తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకోవాలన్నారు. రైతులు ఒకరోజు ముందే వేలం కేంద్రానికి వచ్చి వేలాన్ని పరిశీలించి దాని ప్రకారం బేళ్లను తీసుకురావాలన్నారు. వేలానికి తీసుకొచ్చిన బేళ్లలో నో బిడ్స్ లేకుండా మంచి సరాసరి ధరతో కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. బేళ్లలో అన్యపదార్థాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొగాకు సరాసరి ధర కేజీ రూ.250.12...

కొండపి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో సరాసరి ధర కేజీ 250.12 పలికినట్లు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పెరిదేపి, మిట్టపాలెం, అనకర్లపూడి, ముప్పరాజువారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 883 బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. అందులో 651 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 232 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.180గా నమోదైంది. వేలంలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పొగాకు సరాసరి ధర కేజీ రూ.251

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో సరాసరి ధర కేజీ రూ.251.75 పలికింది. కారుమంచి క్లస్టర్ పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు 824 బేళ్లను వేలానికి తీసుకురాగా, వాటిలో 692 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 132 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.280 పలకగా, కనిష్ట ధర రూ.180 పలికింది. సరాసరి ధర రూ.251.75 పలికింది. వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఈ సత్యనారాయణ

పొన్నలూరు: గ్రామాల్లో పీఎంఏవై స్కీం ద్వారా నిర్మిస్తున్న ఇళ్లను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మించుకోవాలని కొండపి డివిజన్ గృహ నిర్మాణశాఖ డీఈ ఎస్‌వీవీ సత్యనారాయణ సూచించారు. మండలంలోని రావులకొల్లు గ్రామంలో శుక్రవారం పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. పీఎంఏవై స్కీం ద్వారా గృహాలు నిర్మిస్తూ మధ్యలో ఆగిపోయిన వారు తిరిగి గృహ నిర్మాణం చేపడితే అదనంగా మరో రూ.50 వేలు మంజూరు చేస్తారన్నారు. రావులకొల్లు గ్రామంలో 35 మంది లబ్ధిదారులు ఉండగా, మండల వ్యాప్తంగా 142 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరంతా సాధ్యమైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ ఉన్నారు.

యూనిఫాం పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

వెలిగండ్ల (కనిగిరి రూరల్): మండల పరిధి వెలిగండ్ల మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు ఎంఈఓ-1 దాసు ప్రసాద్, ఎంఈఓ-2 దేవిరెడ్డి రామిరెడ్డిలు శుక్రవారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనిఫాం సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల హెచ్ఎం పాపబత్తిని ఉమాపతి, ఉపాధ్యాయులు గజ్జల తిరుపతిరెడ్డి, మేరీ, విజయకుమారి, దేవిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, రుమణమ్మ, సుబ్బమ్మ, మాధవి, లత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



అలంకరణలో అచ్చమాంబ మూల విగ్రహమూర్తి

పామూరు: మండలంలోని కమ్మవారిపాలెం, రఘునాథపురం అచ్చమాంబ పేరంటాళ్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ రోజు శుక్రవారం కలశపూజ, చండీహోమం రుత్వికులు కొల్లూరి రవికిరణ్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి మూలవిగ్రహమూర్తికి, ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం, కుంకుమపూజ చేశారు. అనంతరం కలశపూజ, చండీహోమం నిర్వహించి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థాన కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో ఆర్డీఓ, పీసీబీ ఈఈ, తహసీల్దార్

పామూరు: మండలంలోని ఇనిమెర్ల గ్రామ పంచాయతీ పరిధి సర్వే నంబర్ 807/1,2తో పాటు మొత్తం 14 సర్వే నంబర్లలో క్లైనైట్, క్వార్ట్జ్ మైనింగ్‌కు గూడూరుకు చెందిన నిషిత మినరల్స్ ప్రతినిధులు దరఖాస్తు చేశారు. దీనిపై శుక్రవారం కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ఒంగోలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ జి.రాఘవరెడ్డి, పామూరు తహసీల్దార్ రామచంద్రుని వాసుదేవరావులు ప్రతిపాదిత ప్రాంతంలో గ్రామస్తులతో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు తమ ప్రాంతంలో మైనింగ్ చేస్తే ఉపాధి లభిస్తుందని చెప్పగా మరికొందరు పరిసర ప్రాంతాలు కలుషితమవుతం కాకుండా చూడాలని సమావేశంలో కోరారు. దీనిపై నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు ఆర్డీఓ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ, తహసీల్దార్‌లు తెలిపారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఏఈ భాస్కర్‌వర్మ, సర్పంచ్ సిద్ధమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి, ఉప సర్పంచ్ బొమ్మన శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దర్గాలో మాజీ మంత్రి ఆదిమూలపు ప్రార్థనలు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఊళ్లమిట్ట దర్గా వద్ద జరుగుతున్న గంధోత్సవం కార్యక్రమంలో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రార్థనలు చేశారు. పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్యతో కలిసి ప్రార్థనలు నిర్వహించి మత పెద్దల ఆశీర్వాదం పొందారు. పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చుక్కా కిరణ్‌కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు మారంరెడ్డి గంగాధర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు దాసు శ్రీను, యువజన విభాగం మండల అధ్యక్షుడు కోమిట్ల వెంకారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఆబిద్‌ఆలీ, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు షేక్ కరీం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికాల సునీల్‌కుమార్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ అల్లాభక్షు, షేక్ పటేల్, చొప్పర వెంకన్న, షేక్ మస్తాన్, 108 మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

14 మందికి వీల్‌చైర్స్ పంపిణీ



వీల్‌చైర్స్ పంపిణీ చేస్తున్న అధికారులు, సిబ్బంది

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులు 14 మందికి శుక్రవారం వీల్‌చైర్స్ జిల్లా ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తుల అధికారి డాక్టర్ వి.అనీల్‌కుమార్, మెడికల్ ఆఫీసర్ లక్ష్మీభార్గవిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు ఫ్లోరైడ్ లేని నీటిని తాగాలన్నారు. మండలానికి సాగర్ జలాలు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ సాగర్ జలాలు తాగాలన్నారు. సాగర్ జలాలో ఫ్లోరైడ్ ఉండదని చెప్పారు. సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సూపర్‌వైజర్లు బాలు, నారాయణరెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.

జాయింట్ ల్యాండ్ కారణంగానే సమస్యలు

కొండపి: భూముల రీ సర్వే జరిగిన గ్రామాల్లో భూమి జాయింట్ ల్యాండ్‌గా పడినందున తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ లబ్ధిదారులకు భూ సంబంధిత సమస్యలు తలెత్తినట్లు కొండపి తహసీల్దారు ఎస్.శ్రీనివాసరావు వెల్లడించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో రీ సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్పీఎం) కలిగిన లబ్ధిదారుల భూములకు సంబంధించి విస్తీర్ణం అధికంగా నమోదు కావడం వల్ల తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకానికి అనర్హులుగా చూపినట్లు గుర్తించామన్నారు. జాయింట్ ఎల్పీఎం కలిగిన రైతులు తమ పేరుపై ఉన్న భూమిని తప్పనిసరిగా సింగిల్ ఎల్పీఎంగా మార్పించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనివల్ల భూమి వివరాలు కచ్చితంగా నమోదవుతాయని తెలిపారు. తద్వారా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకంలో న్యాయమైన విధంగా లబ్ధి అందించగలమని పేర్కొన్నారు. ఈ సబ్ డివిజన్ ప్రక్రియను పూర్తి చేసుకోవడానికి ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. భూమి వివరాల్లో కచ్చితత్వం ఉండకపోతే ప్రభుత్వ పథకాలు అందించడంలో జాప్యం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం పథకం అమలులో స్పష్టత ఏర్పడి అసలైన లబ్ధిదారులకు ప్రయోజనం అందుతుందని తెలిపారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

పామూరు: ప్రజలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై దృష్టి సారించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక అనిల్ గార్డెన్స్‌లో శుక్రవారం విద్యుత్ శాఖ పామూరు సబ్ డివిజన్ పరిధిలోని పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల కోఆర్డినేషన్ సమావేశం డీఈఈ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుని తద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గృహంలో వినియోగించుకోవాలన్నారు. దీని కోసం ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో రాయితీలు ఇస్తోందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా ఇంధనం ఆదా అవుతుందని, ఇది భావితరాలకు ఎంతో మేలు చేసినవారమవుతామన్నారు. సిబ్బంది విధిగా ఒక్కొక్కరు కనీసం రెండు సోలార్ ప్యానెల్ కనెక్షన్లు ఏర్పాటు చేయించాలన్నారు. అదేవిధంగా బిల్లుల వసూలు, అక్రమ సర్వీసుల తొలగింపులో సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యుత్ అదనపు లోడును రాయితీపై నగదు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఎస్ఏఓ కె.సుబ్బారావు, ఈఈ డి.ఉమాకాంత్, ఏఈ జిలానీ, సీఎస్‌పురం, వెలిగొండ్ల, కనిగిరి, హెచ్ఎంపాడు, పీసీపల్లి మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా దినోత్సవ సభ ఏర్పాట్లు పూర్తి



యోగా దినోత్సవ ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

పామూరు: మండల కేంద్రం పామూరులో అంతర్జాతీయ యోగా దినోత్సవం శనివారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో యోగాసనాలు వేసేందుకు అన్ని వసతులు కల్పించామన్నారు. అదేవిధంగా మండలంలోని 19 సచివాలయాల పరిధిలో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ కె.సుందరరామయ్య, పీఎస్ జి.అరవిందారెడ్డి పాల్గొన్నారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: కనిగిరి మున్సిపాల్టీ పరిధిలో ఒకటో సచివాలయాన్ని మున్సిపాల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా సచివాలయ సిబ్బంది హాజర్ పట్టి, విధి నిర్వహణల రికార్డులు, సంక్షేమ పథకాల రికార్డులు, మూవ్‌మెంట్ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా విధులకు సక్రమంగా హాజరు కాకుండా విధి నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యవేక్షణ లేకనే సచివాలయ సిబ్బంది విధులకు హాజరు కాకుండా దుమ్మా కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు సక్రమంగా హాజరు కాని వారి వివరాలు లిఖిత పూర్వకంగా తీసుకెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.